క్లుప్తంగా

రక్తదానం



కడప ఎడ్యుకేషన్: అన్ని దానాలకన్నా రక్తదానం మిన్న అని జెకె జనం కోసం యూత్ వెల్ఫేర్ సొసైటీ వ్యవస్థాపకులు లయన్ పటాన్ ఖాదర్‌బాషా అన్నారు. గురువారం కడప గుంతబజార్ సున్ని మసీద్‌లో విలాద్ జుసుస్ కమిటి, ఖూన్ క రిస్తా సంయుక్త ఆధ్వర్యంలో ఈద్–ఉల్ మిలీత్ పురస్కరించుకుని మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పలువురు రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఈద్ మిలాద్ కమిటి వ్యవస్థాపకులు మహమ్మద్ ఆలీ బాగ్దాది, ఖూన్ కా రిస్తా చారిటబుల్ ట్రస్టు చైర్మన్ తారీక్ అలీ పాల్గొన్నారు.

రాజధాని పేరుతో అక్రమాలు

కడప కార్పొరేషన్: అమరావతి రాజధాని పేరుతో అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు, ఆయన తనయుడు లోకేష్ అనేక అక్రమాలకు పాల్పడ్డారని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి అఫ్జల్‌ఖాన్ అన్నారు. గురువారం తన కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడారు. ఇన్నర్ రింగ్ రోడ్డు విషయంలో అనేక అక్రమాలు చోటు చేసుకున్నాయన్నారు. వీటన్నింటినీ సీఐడి గుర్తించిందన్నారు. అసైన్డ్ రైతుల నుంచి భూములు బలవంతంగా లాక్కున్నారని, వారి పేర్లతో వచ్చిన ప్లాట్లను కూడా వీరే కాజేశారన్నారు. రాజధాని ముసుగులో వందల ఎకరాలను దోచుకొని వీరు సాగించిన దోపిడీ ఇప్పుడు బయటపడుతోందన్నారు. లోకేష్ కూడా జైలుకెళ్లడం తథ్యమన్నారు.

స్వామినాథన్‌కు ఘన నివాళి

కడప కల్చరల్ : అన్నదాత లేనిదే ప్రపంచం ముందుకు నడవదని చాటి చెప్పిన వ్యవసాయ శాస్త్రవేత్త స్వామినాథన్ అని, ఆయన మరణం దేశానికి తీరనిలోటని వైవీయూ పాలకమండలి సభ్యుడు ఆచార్య మూల మల్లికార్జునరెడ్డి పేర్కొన్నారు. సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంలో గురువారం 'భారత హరిత విప్లవ పితామహుడు' ఎంఎస్ స్వామినాథన్ సంస్మరణ సభను నిర్వహించారు. స్వామినాథన్ చిత్రపటం వద్ద నివాళులర్పించారు. ఈ సందర్భంగా మూల మల్లికార్జునరెడ్డి , వైవీయూ అధ్యాపకులు ఆచార్య మధుసూదనరెడ్డి, ఆచార్య వీరాంజనేయ రెడ్డి, ఆచార్య ఎ.చంద్రశేఖర్ మాట్లాడుతూ స్వామినాథన్ జీవితంలోని ముఖ్యమైన ఘట్టాలను, వ్యవసాయ రంగంలో ఆయన చేసిన పరిశోధనలు, భారత రైతులకు ఆయన కల్పించిన గౌరవం తదితర అంశాలను వివరించారు. బ్రౌన్ గ్రంథాలయ సహాయ పరిశోధకులు డాక్టర్ భూతపురి గోపాలకృష్ణశాస్త్రి, డాక్టర్ చింతకుంట శివారెడ్డి, డాక్టర్ రాజగోపాల్ రెడ్డి తదితరులు కూడా మాట్లాడారు.

జనం కవి జాషువా



జాషువా చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న యూటీఎఫ్ నాయకులు

కడప ఎడ్యుకేషన్: గుర్రం జాషువా నిమ్నకులంలో జన్మించినప్పటికి ప్రతిభా పాటవాలతో ఉపాధ్యాయుడిగా, సాహితీవేత్తగా, రేడియో వ్యాఖ్యాతగా, ఎమ్మెల్సీగా అంచలంచలుగా ఉన్నత స్థానానికి చేరుకున్న మహోన్నత వ్యక్తి అని కవి, పండితులు మజ్జారి చెన్నకేశవ అన్నారు. యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పాలెం మహేష్‌బాబు ఆధ్వర్యంలో గురువారం కడప యూటీఎఫ్ భవన్‌లో జాషువా జయంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గుర్రం జాషువా అంటరాని తనాన్ని రూపు మాపడానికి తన కలాన్నే ఆయుధంగా మార్చుకున్నారని అన్నారు. యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పాలెం మహేష్‌బాబు , యూటీఎఫ్ ట్రెజరర్ నరసింహారావు, ఆడిట్ కమిటి కన్వీనర్ ప్రభాకర్‌నాయుడు, నాయకులు పాల్గొన్నారు.

జీపీఎస్ ప్రతులు దహనం

కడప ఎడ్యుకేషన్: సీపీఎస్ ఉద్యోగులకు తీవ్రమైన అన్యాయం జరిగిందని యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పాలెం మహేష్‌బాబు ఆరోపించారు. యూటీఎఫ్ రాష్ట్ర కమిటి పిలుపు మేరకు గురువారం అసెంబ్లీ ఆమోదించిన జీపీఎస్ ప్రతులను యూటీఎఫ్ భవన్ ఎదుట నాయకులతో కలిసి దహనం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం సరికాదన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ట్రెజరర్ నరసింహారావు, ఆడిట్ కమిటి కన్వీనర్ ప్రభాకర్, నాయకులు పాల్గొన్నారు.

గణేష్ నిమజ్జనం

బద్వేలు అర్బన్ : వినాయకచవితి సందర్భంగా స్థానిక నాలుగు రోడ్ల కూడలిలో ఆర్యవైశ్య వర్తక సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన గణనాథునికి 11 రోజుల పాటు విశేష పూజలు అందించి గురువారం కోలాహలంగా నిమజ్జనం నిర్వహించారు. డప్పుల వాయిద్యాలు, బాణాసంచా పేలుళ్ళు, యువకుల కేరింతల నడుమ నిమజ్జనానికి తరలించారు. భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. బద్వేలు అర్బన్ సీఐ యుగంధర్ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

పేదలకు వరం సీఎం రిలీఫ్ ఫండ్

కడప కార్పొరేషన్: ముఖ్యమంత్రి సహాయ నిధి నిరుపేదలకు వరం లాంటిదని ఉప ముఖ్యమంత్రి ఎస్‌బి అంజద్‌బాషా అన్నారు. గురువారం తన క్యాంపు కార్యాలయంలో సీఎం రిలీఫ్ ఫండ్ కింద మంజూరైన రూ.10 లక్షల ఎల్‌ఓసీ, రూ.9.30 లక్షల చెక్కులు కలిపి రూ.19.30 లక్షలను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం మాట్లాడుతూ పేదల ఆరోగ్య సమస్యలను పరిష్కరించడానికి ప్రభుత్వం ఎల్లప్పుడు ముందుంటుందన్నారు. ఆరోగ్యశ్రీ పథకం వర్తించని జబ్బులకు ముఖ్యమంత్రి సహాయ నిధి కింద పేద ప్రజలకు ఆర్థిక సాయం అందించినందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. కడప నగరంలో ఈ నాలుగేళ్లలో రూ.8కోట్లకుపైగా సీఎం సహాయ నిధి ద్వారా సహాయం చేయడం గొప్ప విషయమన్నారు. కడప నగరానికి చెందిన నూనె రమేష్‌కు లివర్ ట్రాన్స్‌ప్లాంటేషన్ శస్త్ర చికిత్స కొరకు రూ.10లక్షల ఎల్‌ఓసీని అందజేశారు. కడప నగరానికి చెందిన భాస్కర్‌రెడ్డి, రామయ్య, హాజీరా బేగం ఆరోగ్య చికిత్సలకు రూ.9.30లక్షల చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు జయచంద్రారెడ్డి, బంగారు నాగయ్య, శ్రీరంజన్‌రెడ్డి, తోటక్రిష్ణ, సుబ్బారెడ్డి, డా. శివానాయక్, గోపాలక్రిష్ణ, జఫ్రుల్లా పాల్గొన్నారు.

డిప్యూటీ సీఎంకు సన్మానం

రాష్ట్రంలోని బేడ, బుడగజంగాలను ఎస్సీ జాబితాలో కలిపేలా అసెంబ్లీలో తీర్మాణం చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఎల్లప్పుడూ రుణపడి ఉంటామని బేడ, బుడగజంగం హక్కుల పోరాట సమితి నాయకులు పస్తం అంజి అన్నారు. గురువారం అసెంబ్లీలో తీర్మాణం ప్రవేశపెట్టేందుకు సహకరించిన డిప్యూటీ సీఎం అంజద్ బాషా, మేయర్ సురేష్ బాబులను వారు వేర్వేరుగా కలిసి శాలువాలు కప్పి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు సుబ్బారెడ్డి, జయచంద్రారెడ్డి, బంగారు నాగయ్య, రామ్మోహన్‌రెడ్డి, క్రిష్ణయ్య, తోటక్రిష్ణ, జమ్మయ్య, లక్ష్మయ్య, రాముడు, ఆంజనేయులు పాల్గొన్నారు.



సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పొందిన లబ్ధిదారులతో డిప్యూటీ సీఎం అంజద్‌బాషా

ప్రతి గడపకు సంక్షేమ పథకాలు

కడప కార్పొరేషన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వంలో పేద బడుగు బలహీన వర్గాల ప్రజల ఇంటి గడప ముందుకే సంక్షేమ పథకాలను అందిస్తున్నామని ఉప ముఖ్యమంత్రి ఎస్.బి.అంజాద్ బాషా అన్నారు. గురువారం 'గడప గడపకు మన ప్రభుత్వం'లో భాగంగా.. 46/2 వ డివిజన్ శాస్త్రి నగర్ సచివాలయం–2 లోని డి ఎం . అండ్ హెచ్ ఓ కార్యాలయ ప్రాంతంలో పలు వీధుల్లో ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ఏవిధంగా ప్రజలకు చేరుతున్నాయని అడిగి తెలుసుకున్నారు. అభివృద్ధి, సంక్షేమ పథకాలను వారికి వివరించి, వారు పొందుతున్న లబ్ధి సమాచారంతో ముఖ్యమంత్రి సంతకం చేసిన బుక్ లెట్‌ను అందజేశారు. ఈ సందర్భంగా షేక్ రిహానా మాట్లాడుతూ మామిళ్లపల్లెలో తనకు ఇంటి స్థలం ఇచ్చారని, ఇంటి వద్ద పెద్ద విద్యుత్ లైన్లు వెళుతుండటం వల్ల నిర్మాణానికి అడ్డంకి ఏర్పడుతోందని తెలిపారు. దీనిపై వెంటనే స్పందించిన డిప్యూటీ సీఎం... ఏడీఈతో మాట్లాడి ఇబ్బంది లేకుండా చూడాలని ఆదేశించారు. తమ కాలనీలో రోడ్లు, కాలువలు సరిగా లేవని పలువురు మహిళలు తెలిపారు. కె. వెంకట రమణమ్మ అనే మహిళ తనకు వైఎస్ఆర్ ఆసరా, జగనన్న చేదోడు, వైఎస్ఆర్ పింఛన్ కానుక, జగనన్న వసతి దీవెన, జగనన్న విద్యా దీవెన, జగనన్న ఇంటి స్థలం, ఇంటి నిర్మాణానికి నగదు ద్వారా రూ.10,45,440 లబ్ధి చేకూరిందని ఆనందం వ్యక్తం చేసింది. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎంవీ రామచంద్రారెడ్డి, 46వ డివిజన్ కార్పొరేటర్ వెంకటగిరి శ్రీదేవి, సోషల్ వెల్ఫేర్ బోర్డ్ చైర్మన్ పులి సునీల్, నాయకులు జయచంద్రా రెడ్డి, బంగారు నాగయ్య యాదవ్, సీహెచ్ వినోద్, రామకష్ణ రెడ్డి, డా. సోహైల్, డా. శివానాయక్, సుబ్బారెడ్డి, తోట కష్ణ, రహీం, పస్తం అంజి, సిహెచ్ సునీల్ పాల్గొన్నారు.



ప్రజలతో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం అంజద్‌బాషా

మత సామరస్యాన్ని ప్రబోధించిన మహా ప్రవక్త

కడప కల్చరల్ : మానవ ప్రపంచానికి మహా ప్రవక్త మహమ్మద్ మత సామరస్యాన్ని ప్రబోధించారని డిప్యూటీ సీఎం ఎస్‌బీ అంజాద్‌బాష అన్నారు. గురువారం అమీన్ హాస్పిటల్ వద్ద ఎండీ నయీమ్ ఆధ్వర్యంలో మిలాదున్నబీ సందర్భంగా అన్నదానం నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన డిప్యూటీ సీఎం అంజద్‌బాష మాట్లాడుతూ మహా ప్రవక్త జన్మదినాన్ని పురస్కరించుకొని ముస్లింలు వేడుకలు నిర్వహించుకుంటున్నారన్నారు. అనంతరం ఆయన అన్నాన్ని వడ్డించి కార్యక్రమాన్ని ప్రారంభించారు.

భగత్‌సింగ్ పోరాటపటిమ నేటి యువతకు ఆదర్శం

కడప ఎడ్యుకేషన్: భగత్‌సింగ్ చేసిన పోరాటం నేటి యువతకు స్ఫూర్తిదాయకం అని అభ్యుదయ వేదిక జిల్లా అధ్యక్షులు విశ్వనాథ్ అన్నారు. గురువారం కడప వివిఆర్ ఎస్టీయూ భవన్‌లో భగత్‌సింగ్ జయంతిని అఖిల భారత అభ్యుదయ వేదిక ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ప్రజాస్వామ్యం– నేటి పోకడలు అనే అంశంపై చర్చావేదిక నిర్వహించారు. అభ్యుదయ వేదిక ప్రధాన కార్యదర్శి శంకరయ్య , రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు సురేష్‌బాబు, మహబూబ్‌బాష, జిల్లా నాయకులు, ఎస్టీయూ సంఘం జిల్లా అధ్యక్షులు రమణారెడ్డి పాల్గొన్నారు.

– బాలాజీనగర్ బాలుర కళాశాల వసతి గృహంలో భగత్‌సింగ్ జయంతి ఘనంగా నిర్వహించారు. భారత విద్యార్థి బ్లాక్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జయవర్ధన్, ఏఐఎస్సీ జిల్లా కార్యదర్శి శ్రీహరి, నాయకులు పాల్గొన్నారు.

– కడప నగరంలోని ప్రగతి నర్సింగ్ హోమ్‌లో పీడీఎస్‌యూ, పీవైఎల్ ఆధ్వర్యంలో భగత్‌సింగ్ జయంతిని నిర్వహించారు. పీడీఎస్‌యూ రాష్ట్ర కార్యదర్శి అంకన్న , పీవైఎస్ నాయకులు శ్రీనివాసులరెడ్డి తదతరులు పాల్గొన్నారు.

– కడపలో భగత్‌సింగ్ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని ప్రగతిశీల విద్యార్థి సంఘం రాష్ట్ర కార్యదర్శి సుబ్బరాయుడు డిమాండ్ చేశారు. గురువారం కడపలోని పీఎస్‌యూ కార్యాలయంలో భగత్‌సింగ్ జయంతిని నిర్వహించారు. పీఎస్‌యూ నాయకులు పాల్గొన్నారు.

వైవీయూ : స్వాతంత్ర్య సమరయోధుడు, విప్లవవీరుడు భగత్‌సింగ్ పోరాటపటిమ నేటి యువతకు ఆదర్శమని కడప ప్రభుత్వ పురుషుల కళాశాల ప్రిన్సిపాల్ డా. జి. రవీంద్రనాథ్ పేర్కొన్నారు. గురువారం కడప నగరంలోని ఆర్ట్స్ కళాశాల ఎన్‌సీసీ యూనిట్ ఆధ్వర్యంలో భగత్‌సింగ్ 116వ జయంతి సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. ఎన్‌సీసీ అధికారి డా. ఆర్. నీలయ్య మాట్లాడుతూ 23 సంవత్సరాల ప్రాయంలో తన ప్రాణాన్ని తృణప్రాయంగా అర్పించిన గొప్ప దేశభక్తుడు భగత్‌సింగ్ అని కొనియాడారు.



కడప ఎడ్యుకేషన్: భగత్‌సింగ్ చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న అభ్యుదయ వేదిక నాయకులు



వైవీయూ : భగత్‌సింగ్ జయంతి సందర్భంగా నినాదాలు చేస్తున్న ఎన్‌సీసీ కేడెట్స్

నేడు ఎమ్మెల్యే రాక

కమలాపురం : స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సభా భవనంలో శుక్రవారం జరిగే మండల సర్వసభ్య సమావేశానికి ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి హాజరు కానున్నారని ఎంపీడీఓ జ్యోతి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అన్ని శాఖల్లో జరిగిన అభివృద్ధి గురించి చర్చిస్తారని అధికారులు పూర్తి సమాచారంతో హాజరు కావాలని ఆమె తెలిపారు.

రేపు వాహనాల వేలంపాట

పులివెందుల రూరల్ : వివిధ కేసుల్లో పట్టుబడిన వాహనాలకు సంబంధించి ఈనెల 30న పులివెందుల ఎస్ఈబీ కార్యాలయంలో శనివారం ఉదయం 11 గంటలకు వేలంపాట నిర్వహిస్తున్నట్లు ఎస్ఈబీ సీఐ రామాంజనేయనాయక్ తెలిపారు. వేలంపాటలో పాల్గొనేవారు ఆధార్‌కార్డుతో కార్యాలయానికి రావాలన్నారు. వేలంపాటలో వాహనాన్ని దక్కించుకున్న వారు జీఎస్టీ కూడా చెల్లించాలన్నారు.

భక్తుల సౌకర్యార్థం షెడ్ ఏర్పాటు



ఆలయ ముందు భాగంలో ఏర్పాటు చేసిన షెడ్

వీరపునాయునిపల్లె : మండలంలోని సంగమేశ్వరాలయంలో భక్తుల సౌకర్యార్థం దాతల సహకారంతో రేకులషెడ్ ఏర్పాటు చేసినట్లు ఆలయ చైర్మన్ శివాంజనేయరెడ్డి తెలిపారు. మండలంలోని తాటిమాకులపల్లె గ్రామానికి చెందిన పాలెం చెన్నారెడ్డి జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యులు రూ.2.5 లక్షలతో షెడ్డును ఏర్పాటు చేశారు. భక్తులకు మరిన్ని సౌకర్యాలు కల్పించేందుకు దాతలు ముందుకు రావాలన్నారు.

పాపాఘ్ని నీరు చెరువులకు మళ్లింపు



కమలాపురం : మండలంలోని టి.చదిపిరాళ్ల, కమలాపురం చెరువులకు పాపాఘ్ని నది నుంచి వరద నీటిని మళ్లించారు. గురువారం ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి ఆదేశాల మేరకు వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పీవీ క్రిష్ణారెడ్డి లేటపల్లె సమీపంలో పాపాఘ్ని నదిలో పారుతున్న వరద నీటిని జేసీబీ ద్వారా చదిపిరాళ్ల, కమలాపురం చెరువులకు మళ్లించారు. రబీ సీజన్ ప్రారంభంలోనే వర్షాలు కురవడంతో ఆ నీటిని చెరువులకు మళ్లిస్తే రైతులు పంటలు సాగు చేసుకునే అవకాశం ఉండటంతో చెరువులకు నీళ్ల మళ్లించామని క్రిష్ణారెడ్డి తెలిపారు.

ఘనంగా మిలాద్ జెండా ఊరేగింపు



కమలాపురం: దర్గా జెండా ఊరేగింపులో పాల్గొన్న పీఠాధిపతి, సోదరులు, భక్తులు



జమ్మలమడుగు: భారీ ర్యాలీ నిర్వహిస్తున్న ఆస్థానయే గౌసియాపీఠాధిపతి, ముస్లింలు

కమలాపురం : జష్నే మిలాద్–ఉన్–నబి జెండా ఊరేగింపు ఘనంగా నిర్వహించారు. గురువారం పీఠాధిపతి శ్రీ హజరత్ ఫైజుల్ గఫార్ షా ఖాద్రి ఆధ్వర్యంలో ఆస్థాన–ఏ–జహీరియా నుంచి దర్గా–ఏ–గఫారియా వరకు మిలాద్–ఉన్–నబి జెండా ఊరేగింపు అశేష భక్త జన సందోహం నడుమ భక్తి శ్రద్ధలతో వైభవంగా నిర్వహించారు. బాణా సంచా కాల్చుతూ డప్పు వాయిద్యాలు, మేళ తాళాలతో ఊరేగింపు సాగింది. నారె–ఏ–తక్బీర్.. అల్లాహు అక్బర్, యా పీర్.. యా గౌస్.. అనే నారాలతో, ఖసీదా ఖానాలతో ఊరేగింపు వైభవంగా సాగింది. అనంతరం పెద్ద దర్గా ఆవరణలో మిలాద్ జెండాను పీఠాధిపతి ప్రతిష్ఠించారు. స్వాముల వారి మజార్లపై పూల చాదర్‌లు సమర్పించి, ప్రత్యేక ఫాతెహా చేశారు. వివిధ ప్రాంతాల నుంచి తరలి వచ్చిన అశేష భక్త జన సందోహానికి అన్నదానం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో పీఠాధిపతి సోదరులు దస్తగిరిస్వామి, మౌలానాస్వామి, గౌస్‌పాక్, జియా, ఇస్మాయిల్, సర్ఫరాజ్, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. అలాగే కుమ్మరివీధిలో వెలసిన తాళిం , తూర్పు వీధిలో వెలసిన జెండా చెట్టు వద్ద ఆ కాలనీల యూత్ ఆధ్వర్యంలో భక్తి శ్రద్ధలతో మిలాద్ వేడుకలు నిర్వహించారు. మత పెద్దలు ఖాసిదా ఖాన నిర్వహించారు. అలాగే జష్న్–ఏ–మీలాద్‌ను పురస్కరించుకుని వైఎస్సార్ సీపీ నాయకుడు ఇస్మాయిల్ ఆధ్వర్యంలో ముస్లిం యువత బైక్ ర్యాలీ నిర్వహించారు. దర్గా నుంచి క్రాస్ రోడ్డు వరకు తిరిగి దర్గా వరకు బైక్ ర్యాలీ నిర్వహించి ఒకరికొకరు మిలాదున్నబీ శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

జమ్మలమడుగు : మహమ్మద్ ప్రవక్త జన్మదినమైన మిలాద్‌నబీ సందర్భంగా పట్టణంలోని ఆస్థానయే గౌసియా పీఠాధిపతి సయ్యద్‌షా గౌస్‌పీరాఖాద్రీ, జామియా మసీదు పీఠాధిపతి సయ్యద్‌షా సాదిక్ పాషాఖాద్రీలు గురువారం భారీ ర్యాలీలు నిర్వహించారు. ఈ ర్యాలీకి ముఖ్య అతిథిగా ఆర్డీఓ జి.శ్రీనివాసులు హాజరయ్యారు. సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరు సన్మార్గంలో నడవడం వల్ల మనసుకు ప్రశాంతతోపాటు విలువలతో కూడిన జీవనాన్ని సాగించవచ్చునన్నారు. కార్యక్రమంలో సయ్యద్‌షా తాహీర్‌పీరాఖాద్రీ, సయ్యద్‌సా అత్తహార్ ఖాద్రీ, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ ముల్లాజానీ, మహమ్మద్ గౌస్ పాల్గొన్నారు.

శాంతి మార్గంలో పయనించాలి

ప్రొద్దుటూరు కల్చరల్ : ప్రశాంత జీవనానికి మహ్మద్ ప్రవక్త చూపిన శాంతి మార్గంలో పయనించాలని అంజుమనె అహ్లె ఇస్లాం అధ్యక్షుడు బొల్లవరం బాషా పేర్కొన్నారు. గురువారం మహమ్మద్ ప్రవక్త జన్మదినం సందర్భంగా అంజుమనె అహ్లె ఇస్లాం ఆధ్వర్యంలో ముస్లింలు మైదుకూరు రోడ్డులోని నజిరుల్లా మఠం నుంచి ఆసారే షరీఫ్ దర్గా వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు శాంతియుత జీవనం గడపడానికి కృషి చేసిన గొప్ప వ్యక్తి మహమ్మద్ ప్రవక్త అని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ ప్రవక్త అడుగుజాడల్లో నడుచుకుని సన్మార్గంలో పయనించాలని సూచించారు. కార్యక్రమంలో వీఎస్ ముక్తియార్, ఖాజీ ఇనాయతుల్లా, మోడంపల్లె మోదిన్ సాహెబ్, కుతుబుద్దీన్, ముస్లింలు పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న ముస్లింలు

మార్కెట్‌కు తరలివస్తున్న చీనీకాయలు

పులివెందుల రూరల్ : స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డుకు రైతులు పండించిన చీనీకాయలను తీసుకుని వచ్చి విక్రయాలు చేయడానికి ఆసక్తి చూపుతున్నారని వ్యవసాయ మార్కెట్‌యార్డు చైర్మన్ చిన్నప్ప అన్నారు. గురువారం పులివెందుల వ్యవసాయ మార్కెట్‌కు నియోజకవర్గంలోని వివిధ గ్రామాల నుంచి సుమారు 70 టన్నుల చీనీ కాయలు మార్కెట్‌యార్డుకు వచ్చాయన్నారు. సూట్ లేకుండా చీనీ విక్రయాలు చేసుకునేందుగా పులివెందుల వ్యవసాయ మార్కెట్ ఎంతో ఉపయోగపడుతుందన్నారు. మార్కెట్‌యార్డులో చీనీ టన్ను ధర రూ.24వేలు పలికినట్లు ఆయన తెలిపారు. మార్కెట్‌యార్డులోని కేంద్రాల వద్దకు చీనీకాయలు తీసుకువచ్చే రైతులకు అన్ని మౌలిక సదుపాయాలను కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, పాడా ఓఎస్‌డీ అనిల్‌కుమార్‌రెడ్డిల ఆదేశాలమేరకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. అనంతపురం చీనీ మార్కెట్ కంటే పులివెందులలోని చీనీ మార్కెట్‌లోనే అధిక ధరలకు చీనీకాయలను కొనుగోలు చేస్తున్నారన్నారు.



వేలంపాటను పర్యవేక్షిస్తున్న మార్కెట్ యార్డు చైర్మన్ చిన్నప్ప

గొడవలు వీడి ప్రశాంతంగా ఉండాలి

ఎర్రగుంట్ల : చిన్న చిన్న విషయాలకు గొడవలు పడి గ్రామంలో ప్రశాంతతను దెబ్బతియకూడదని ఇరు వర్గాలకు జమ్మలమడుగు డీఎస్పీ నాగరాజు గురువారం కౌన్సిలింగ్ చేశారు. గురువారం తిప్పలూరు గ్రామంలో ఎర్రగుంట్ల తహసీల్దార్ నాగేశ్వరరావు, పట్టణ సీఐ ఈశ్వరయ్యలతో కలిసి ఆయన పర్యటించారు. వినాయక నిమజ్జనం విషయంలో డప్పు వాయిద్యాల, బాణసంచా వల్ల కొంత అపోహలు రావడంతో దళితులకు, అగ్రవర్ణాలకు మనస్పర్థలు వచ్చాయన్నారు. దీంతో తమకు న్యాయం చేయాలని దళితులు ఎర్రగుంట్ల పట్టణంలోని నాలుగురోడ్ల కూడలిలో ధర్నా చేపట్టారు. వీరి మధ్య వచ్చిన అపోహలను తొలగించేందుకు పోలీస్‌స్టేషన్‌కు ఇరువర్గాలను పిలిపించి కౌన్సిలింగ్ అందించారు. గ్రామంలో ఏ చిన్న ఉత్సవం కానీ, మరే ఇతర విషయాలు జరిగినా అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని డీఎస్పీ సూచించారు. గ్రామంలో వారం రోజులు పాటు పికెటింగ్‌ను పోలీసులు పెట్టినట్లు తహసీల్దార్ నాగేశ్వరరావు తెలిపారు.



తిప్పలూరులో ఇరు వర్గాలతో మాట్లాడుతున్న డీఎస్పీ నాగరాజు, తహసీల్దార్ నాగేశ్వరరావు

పెద్దదర్గాలో అన్నదానం



ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిస్తున్న దర్గా భక్తులు

కడప కల్చరల్ : మహా ప్రవక్త మహమ్మద్ (సొ.అ.వ) పవిత్ర జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం కడప నగరమంతటా 50కు పైగా ప్రాంతాలలో భారీగా అన్నదానాలు నిర్వహించారు. ప్రధానంగా కడప అమీన్‌పీర్ (పెద్ద)దర్గాలో బార్మి అన్నదానం నిర్వహించారు. దర్గా పీఠాధిపతి హజరత్ సయ్యద్‌షా ఆరీపుల్లా హుసేనీ సాహెబ్ ఆశీస్సులతో దర్గా భక్తులు పెద్ద సంఖ్యలో తెల్లవారుజాము నుంచి దర్గా ప్రాంగణంలో అన్న ప్రసాద పంపిణీకి ఏర్పాట్లు చేశారు. నగరం నలుమూలల నుంచి భక్తులు కార్యక్రమానికి హాజరయ్యారు. దర్గా వలంటీర్లు సహకారం అందించారు. తొలుత ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి బార్మి అన్నదానం ప్రారంభించారు.

- స్థానిక రెండవ గాంధీ బొమ్మ వద్ద మిలాదున్నబీని పురస్కరించుకుని మౌలానా ఎడ్యుకేషనల్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షులు అబ్దుల్ షబ్బీర్ బార్మి అన్నదానం చేశారు.

బెంగుళూరుకు అదనపు సర్వీసులు నడపాలి



కడప కోటిరెడ్డిసర్కిల్ : కడప నుంచి బెంగుళూరుకు అదనపు సర్వీసులు నడపాలని ప్రయాణీకులు కోరుతున్నారు. కడప నుంచి నిర్ణీత సమయంలో మాత్రమే బస్సులు నడుపుతున్నారని, ఈ కారణంగా ప్రయాణీకులు ప్రైవేటు ట్రావెల్స్‌ను ఆశ్రయించాల్సి వస్తోందన్నారు. మదనపల్లె నుంచి కూడా చాలా తక్కువ సర్వీసులు నడుస్తున్నాయన్నారు. ఆర్టీసీ అధికారులు ప్రయాణీకుల రద్దీ మేరకు బెంగుళూరుకు తగినన్ని సర్వీసులు నడపాలని వారు సూచించారు.

పెంపుడు జంతువులకు వ్యాక్సిన్లు వేయించాలి

ప్రొద్దుటూరు కల్చరల్ : పెంపుడు కుక్కలు, పిల్లులకు యాంటి రేబిస్ వ్యాక్సిన్ వేయించాలని మున్సిపల్ కమిషనర్ వెంకటరమణయ్య, పద్మశాలి కార్పొరేషన్ చైర్‌పర్సన్ జింకా విజయలక్ష్మి తెలిపారు. స్థానిక జీవన జ్యోతి పాఠశాలలో సహదేవ అనిమల్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో ప్రపంచ రేబిస్ దినోత్సవం సందర్భంగా ఉచితంగా కుక్కలకు, పిల్లులకు యాంటి రేబిస్ టీకాలు వేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రేబిస్ వ్యాధి పట్ల జాగ్రత్తగా ఉండాలన్నారు. పశువైద్య అధ్యాపకుడు డాక్టర్ భాస్కర్ మాట్లాడుతూ పెంపుడు జంతువులకు రేబిస్ వ్యాధి రాకుండా యజమానులు టీకాలు తప్పనిసరిగా వేయించాలని, వాటి ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు.

ఘనంగా అనంత పద్మనాభ స్వామి వ్రతం

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక శివాలయం వీధిలోని విశ్వంభర దత్తాత్రేయ స్వామి ఆలయంలో భాద్రపద మాస చవితి సందర్భంగా ఘనంగా అనంత పద్మనాభ స్వామి వ్రతాన్ని నిర్వహించారు. వేకువ జామున దత్తాత్రేయ స్వామి మూల విరాట్‌కు, దత్తాత్రేయ స్వామి, అనఘాదేవి ఉత్సవ మూర్తులకు ప్రత్యేక పూజలు చేసి అలంకరించారు. అనంతరం అనంత పద్మనాభ స్వామి వ్రతాన్ని నిర్వహించారు. వ్రతాన్ని ఆచరించడం వల్ల కలిగే శుభాలను ఆలయ అర్చకులు రామాచారి, వాసు స్వామి వివరించారు. పూజా కార్యక్రమం అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో శ్రీపాద వల్లభ సేవా సంఘం నిర్వాహకులు చింతకుంట జయచంద్ర, మిట్టా నరేష్ గుప్తా, సుధాకర్, బసవయ్య తదితరులు పాల్గొన్నారు.

నేడు సత్యనారాయణ స్వామి వ్రతం

బ్రహ్మంగారిమఠం: తిరుమల తిరుపతి దేవస్థానముల ఆధ్వర్యంలో హిందూ ధర్మ ప్రచార పరిషత్ వైఎస్సార్ జిల్లా కమిటీ నిర్వాహకులు శుక్రవారం ఉదయం 9 గంటలకు ఈశ్వరీదేవి మఠంలో ఉచిత సామూహిక సత్యనారాయణస్వామి వ్రతం నిర్వహిస్తున్నట్లు ధర్మ ప్రచార కమిటీ సభ్యుడు చాపాటి వెంకటసుబ్బారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. భక్తులు ఈ వ్రతంలో పాల్గొని తీర్థ ప్రసాదాలు పొందాలన్నారు.